క్లుప్తంగా

ఆలోచింపజేసిన ఓపెన్ హౌస్



నాటిక ప్రదర్శనలో విద్యార్థులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు శ్రీహరిపురంలోని భాష్యం పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఓపెన్ హౌస్ కార్యక్రమం ఆలోచింపజేసింది. విద్యార్థులు ఇక్కడ నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌తోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రత్యేక నాటిక ప్రదర్శించి అలరించారు. పాఠశాల యాజమాన్య ప్రతినిధులు ఆంజనేయులు, ప్రిన్సిపాల్ గీతా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'పింఛన్ ఇప్పించి ఆదుకోండి'



కార్పొరేటర్ కొణతాల సుధకు సమస్య వివరిస్తున్న రాము

మల్కాపురం: 'నా కుటుంబ పరిస్థితి బాగో లేదు. ఆర్థికంగా సతమతమవుతున్నాం. పింఛన్ ఇప్పించి ఆదుకోండి' అని 61వ వార్డు రెడ్డి వీధికి చెందిన రాము అనే వ్యక్తి విజ్ఞప్తి చేశాడు. ఈ మేరకు శుక్రవారం మల్కాపురంలోని కార్పొరేటర్ కొణతాల సుధ కార్యాలయానికి తన కుటుంబ సభ్యులను తీసుకెళ్లి ఆమెకు సమస్యను వివరించాడు. అవయవ లోపంతో తాను బాధపడుతున్నానని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా తన కుటుంబం పూట గడవని పరిస్థితిలో ఉందని రాము చెప్పాడు. తనకు ఉన్న లోపాన్ని చూపి ప్రభుత్వ పింఛన్‌కు దరఖాస్తు చేయగా.. సాంకేతిక లోపం కారణంగా అధికారులు మంజూరు చేయలేదని తెలియజేశాడు. ఈ సమస్యపై స్పందించిన కార్పొరేటర్ సుధ బాధితుడు రాముకు ప్రభుత్వ పింఛన్ వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మర్రిపాలెం రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

తాటిచెట్లపాలెం: మర్రిపాలెం రైల్వే స్టేషన్ పరిధిలోని న్యూకోచింగ్ కాంప్లెక్స్ దగ్గరలో రైల్వే ట్రాక్ కింద గల డ్రైనేజీలో శుక్రవారం మధ్యాహ్నం కుళ్లిపోయిన మృతదేహాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న గవర్నమెంట్ రైల్వే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. జీఆర్పీ సీఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాలిలా.. సుమారు 30 నుంచి 45 ఏళ్ల వయసు గల వ్యక్తి గుర్తుతెలియని రైలు నుంచి జారిపడటం వల్ల గానీ, రైలు ఢీకొట్టడం వల్ల గానీ మరణించి ఉండవచ్చు. మర్రిపాలెం స్టేషన్ పరిధిలోని రైల్వే ట్రాక్ కిందనున్న డ్రైనేజీలో మృతదేహం కుళ్లిపోయి గుర్తుపట్టడానికి వీలు లేకుండా ఉంది. మృతుడి వద్ద ఏ విధమైన ఆధారాలు లేవు. ఈ వ్యక్తి క్రీమ్ కలర్ షర్ట్, గ్రే కలర్ జీన్ ప్యాంట్స్, వైట్ కలర్ బనియన్, రెడ్ కలర్ బెల్ట్ ధరించి ఉన్నాడు. ఈ వ్యక్తి శరీరంపై గోవిందు అనే తెలుగు అక్షరాలు, సరళ అనే ఇంగ్లిష్ అక్షరాలతో పచ్చబొట్లు మాత్రమే ఉన్నాయి. ఇతడి గురించి వివరాలు తెలిసిన వారు విశాఖ రైల్వే స్టేషన్‌లోని జీఆర్పీ సిబ్బందికి స్వయంగా గానీ లేదా 94406 27547, 98664 13487 నంబర్లలో గానీ తెలియజేయాలని సీఐ కోరారు. జీఆర్పీ సీఐ సూచనల మేరకు ఎస్ఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.2.15 కోట్ల పన్ను చెల్లించిన ఐలా

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీకి ఆటోనగర్‌లోని ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐలా) శుక్రవారం రూ.2.15 కోట్లు పన్ను చెల్లించింది. జీవీఎంసీలోని వివిధ విభాగాలకు ఐలా కమిషనర్ కె.సూర్యనారాయణ ఈ పన్ను చెల్లించినట్లు ఐలా ప్రధాన కార్యదర్శి చీకటి సత్యనారాయణ తెలిపారు.

ప్రజాస్వామ్య స్ఫూర్తితో..

- 2న దుర్గాపురం గ్రామ కమిటీ ఎన్నికలు
- ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక కమిటీ
- చిన్న గ్రామంలో ఫరిడవిల్లుతున్న ప్రజాస్వామ్యం



57వ వార్డులో దుర్గాపురం ముఖ ద్వారం

గోపాలపట్నం: అది మహానగరంలోని ఓ చిన్న గ్రామం.. ఆ గ్రామంలో ప్రజాస్వామ్యం ఫరిడవిల్లుతోంది. అదే జీవీఎంసీ 57వ వార్డు దుర్గాపురం. ప్రజాస్వామ్య స్ఫూర్తితో గ్రామ అధ్యక్షుడి ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలే ఇక్కడ కూడా వర్తింప చేస్తున్నారు. సాధారణ ఎన్నికలను తలపించే విధంగా ప్రక్రియ ఉంటుంది. బరిలో నిలిచిన అభ్యర్థులు ముందే మేనిఫెస్టో ప్రకటించారు. నామినేషన్ల ప్రక్రియతో పాటు శుక్రవారం సాయంత్రంతో ప్రచార గడువు ముగిసింది. ఈ నెల 2వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నారు. మొత్తం 680 మంది ఓటర్లు ఉన్నారు.

ఎన్నికల ప్రక్రియ ఆరంభం ఇలా..

ఎన్నికల ప్రక్రియ ఏ విధంగా చేపట్టాలని గ్రామంలో పెద్దలు నిర్ణయిస్తారు. గ్రామ సభ నిర్వహించి ఎన్నికల కమిటీని ఎన్నుకున్నారు. ఆకమిటీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ మొత్తం కొనసాగుతుంది.

ఇవీ నిబంధనలు

- 18 ఏళ్లు నిండినవారే ఓటింగ్‌లో పాల్గొనాలి.
- కనీసం గ్రామంలో 15 నుంచి 20 ఏళ్లుగా నివసిస్తున్న వారై ఉండాలి. - గ్రామంలో నివాసీయులై సొంత ఇళ్లు ఉండి ఉద్యోగ రీత్యా, మరే ఇతర కారణాలతో బయట ఉన్నవారు సైతం ఓటింగ్‌కు అర్హులవుతారు. ఓటింగ్ వేసేందుకు ఓటర్ ఐడీ లేదా ఆధార్ కార్డు ఉండాలి.

ముగిసిన ప్రచారం

మార్చి 28,29 తేదీల్లో నామినేషన్లు దాఖలు చేశారు. 30వ తేదీ విత్ డ్రాల్ పూర్తయింది. 31తో ప్రచారం ముగిసింది. ఏప్రిల్ 2న (ఆదివారం) ఉదయం నుంచి ఓటింగ్ మొదలవుతుంది. అదే రోజు లెక్కింపు, విజేతను ప్రకటిస్తారు.

ఈ ఎన్నికల్లో గెలిచిన గ్రామ కమిటీ అధ్యక్షుడి పదవీ కాలం 3 ఏళ్లు ఉంటుంది. మిగిలిన కమిటీ సభ్యులను అధ్యక్షుడి ఆధ్వర్యంలో ఎన్నుకుంటారు.

ధరావత్తు చెల్లించాల్సిందే..

నామినేషన్ వేయాలంటే రూ.10 వేలు ఎన్నికల నిర్వహణ కమిటీకి కట్టాలి. అందులో సగం ఆలయ అభివృద్ధికి ఉపయోగిస్తారు. మిగిలిన నగదుతో ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ నగదు తిరిగి ఇవ్వరు.



దుర్గాపురం ఇదే

గ్రామంలో దీర్ఘకాలిక సమస్యలు...

దుర్గాపురంలో దీర్ఘ కాలిక సమస్యలు ఉన్నాయి. ఈ గ్రామం పోర్టు స్థలంలో నిర్మాణమై ఉంది. ఆ స్థలాన్ని నేవీకి పోర్టు లీజుకు ఇచ్చేంది. ఇదే ఇక్కడి ప్రధాన సమస్య. వీరికి ఇళ్ల పట్టాలు కావాలని డిమాండ్ చేస్తున్నారు. మరో ప్రధాన సమస్య రహదారి...ఈ గ్రామానికి వెళ్లాలంటే సాకేతపురం మీదుగా నేవెల్ ఆర్మమెంట్ డిపో(ఎన్ఏడీ)కు వెళ్లే రహదారిలో వెళ్లాలి. అయితే రాత్రి సమయంలో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. మరో మార్గం కరాసా మీదుగా రైల్వే ట్రాక్స్ మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. గ్రామం చుట్టూ పోర్టు, నేవీ, రైల్వే అధికారులు గోడలు నిర్మించేశారు. దీంతో ఈ గ్రామానికి రహదారి లేని పరిస్థితి ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు. గ్రామ కమిటీ అధ్యక్ష బరిలో ఉన్న వారు ఈ రెండు ప్రధాన సమస్యలు పరిష్కరించేందుకు వారి వారి ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తా...



గ్రామంలో ప్రధాన సమస్యల పరిష్కారంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తాను. గతంలో గ్రామ సమస్యలపై పోరాటాలు చేశాను. మా గ్రామస్తులకు ఏం కావాలో నాకు బాగా తెలుసు.

– బొడ్డేపల్లి హేమలత, అభ్యర్థి

ఇళ్ల పట్టాలు వచ్చే వరకు పోరాడుతా.



మా గ్రామంలో ప్రధాన సమస్య ఇళ్ల పట్టాలు... ఇవి వచ్చేవరకు పోరాడుతాను. ఉన్నతాధికారులు, నాయకుల దృష్టికి ఈ సమస్య తీసుకెళ్లాం. పరిష్కరించేందుకు మరింత ఒత్తిడి తెస్తాను.

– దమ్ము గోవిందు, అభ్యర్థి

గ్రామాభివృద్ధికి కృషి



గ్రామాభివృద్ధికి కృషి చేస్తాను. ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు చేపట్టాను. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా అవకాశం ఇస్తే మరిన్ని సేవలు అందిస్తాను.

– చందాపు గుణేశ్వరరావు, అభ్యర్థి

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



గోపాలపట్నం రజకుల కాలనీలో పరిస్థితిని సమీక్షిస్తున్న బయాలజిస్ట్ చక్రవర్తి

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు రజకుల కాలనీలో బయాలజిస్ట్ చక్రవర్తి శుక్రవారం ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా పలు ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నామన్నారు. మలేరియా విభాగం సిబ్బంది ఎప్పటికప్పుడు దోమల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాల్వల్లో దోమల నివారణకు మందులు పిచికారీ చేయాలని సూచించారు. ప్రజలు కూడా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరా పరిశుభ్రత పాటించి వ్యాధుల నివారణకు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మలేరియా ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, దమ్ము శ్రీనివాసరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన సదస్సు నేడు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం వినియోగదారుల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్.వి.సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. వాకర్స్ పార్కులో సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో సామాజిక వేత్త, మోటివేటర్, రిసోర్స్ పర్సన్, విశాఖ జిల్లా వినియోగదారుల సమస్యల పరిష్కార కమిషన్ సభ్యురాలు రహీమున్నీసా బేగమ్ ముఖ్య అతిథిగా పాల్గొని వినియోగదారుల హక్కులు, సమస్యల పరిష్కారం అనే అంశంపై ప్రసంగిస్తారన్నారు.

ఆడారికి అభినందనల వెల్లువ



ఆడారి ఆనంద్‌కుమార్‌ను సత్కరిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు, నాయకులు



ఆడారి ఆనంద్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందిస్తున్న బెహరా భాస్కరరావు తదితరులు



ఆడారి ఆనంద్‌కుమార్‌కు జ్ఞాపిక అందిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, బీఎస్ కృష్ణ

గోపాలపట్నం: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ విజయవాడ ముత్యాలపాడు కార్యాలయంలో శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఆయన్ను నియోజకవర్గ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారిలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, 90వ వార్డు అధ్యక్షుడు చుక్క ప్రసాదరెడ్డి, 89వ వార్డు నాయకుడు అయితశెట్టి గోపి తదితరులు ఉన్నారు.

'చలో ఢిల్లీ' జయప్రదానికి బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో మల్కాపురం జోన్ నాయకులు

సింధియా: చలో ఢిల్లీ యాత్రను జయప్రదం చేయాలని కోరుతూ సీఐటీయూ మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సింధియా నుంచి జింక్ గేట్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్కాపురం జోన్ కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 5న ఢిల్లీలో లక్షలాది మంది కార్మికులు, రైతులతో కలిసి నిరసన తెలియజేయనున్నామన్నారు. అదానీ, అంబానీల సేవలో బీజేపీ సర్కారు మునిగిపోయి దేశంలోని రైతులు, కార్మికుల కడుపులు కొడుతోందని మండిపడ్డారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేల ఇవ్వాలని, రైతుల పండించే పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, దేశంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని, ప్రభుత్వరంగ పరిశ్రమల ప్రైవేటీకరణను ఆపాలని, అధిక ధరలను అరికట్టాలనే పలు డిమాండ్లతో ఢిల్లీలో చేపట్టే మహా ప్రదర్శనలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మల్కాపురం జోన్ అధ్యక్షుడు కె.పెంటారావు, షిప్‌యార్డ్ సీఐటీయూ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కె.జానకీరామ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో కుక్కల బెడద



గుల్లలపాలెంలో కారుపై దర్జాగా కూర్చున్న వీధి కుక్క



మల్కాపురంలో కారుపై సేదతీరుతున్న శునకం

- వీధుల్లో శునకాల స్వైరవిహారం
- ఇబ్బంది పడుతున్న నివాసులు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో వీధి కుక్కల బెడద రోజురోజుకూ అధికమవుతోంది. ఈ సమస్యపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు సరిగ్గా స్పందించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని నివాసులు వాపోతున్నారు. జీవీఎంసీ 58వ వార్డు గుల్లలపాలెం పరిసర ప్రాంతాల్లో పగలు, రాత్రి అనే తేడా లేకుండా శునకాలు స్వైర విహారం చేస్తున్నాయి. ఆయా మార్గాల్లో రాకపోకలు సాగిస్తున్న పాదచారులు, వాహన చోదకులపై దాడి చేస్తున్నాయి. సర్వీస్ రోడ్లపై పార్క్‌చేసిన ఆటో, కార్లపైకి ఎక్కి పాడుచేస్తున్నాయని వాహనాల యజమానులు లబోదిబోమంటున్నారు.

గుంపులు గుంపులుగా సంచారం

జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం పరిసర ప్రాంతాల్లో వీధి కుక్కల సమస్య ఎక్కువగా ఉందని స్థానికులు చెబుతున్నారు. ఇవి వీధుల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తూ నివాసులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. వీధి కుక్కల సమస్యను నివారించాలని సంబంధిత అధికారుల వద్ద మొర పెట్టుకున్న నేటికీ పరిష్కారం కాలేదు పలువురు స్థానికులు వాపోతున్నారు. తక్షణం తగు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన



నరవలో ర్యాలీ నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ విద్యార్థులు

గోపాలపట్నం: విశాఖ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు శుక్రవారం నరవ గ్రామంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రిన్సిపాల్ శ్రీధర్ పట్నాయక్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడడం వల్ల పర్యావరణానికి కలిగే నష్టాన్ని వివరించారు. ప్లాస్టిక్ సంచుల వినియోగం మానాలని సూచించారు. ప్లకార్డులతో ప్రదర్శనలిచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి చిటిమిరెడ్డి వీరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై నిర్లక్ష్యం వద్దు



కంచరపాలెం రైతుబజార్‌లో కరపత్రాలు అందిస్తున్న ఆర్పీ పేట ఆరోగ్య కేంద్రం సిబ్బంది

కంచరపాలెం: ఆర్పీ పేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మట్టా శశిప్రియాంక నేతృత్వంలో శుక్రవారం కంచరపాలెం రైతుబజార్‌లో 'క్షయ వ్యాధిని మనం అంతమొందించగలం' అనే నినాదంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ టీబీ వ్యాధిని ప్రజలు నిర్లక్ష్యం చేయరాదన్నారు. క్షయ లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమాలను చేపట్టాయన్నారు. రైతులు, వినియోగదారులు, డ్వాక్రా మహిళలకు కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టీబీ పీఆర్వో ఎస్.పైడిరాజు, సిబ్బంది, సచివాలయ ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన కర్ణాటక గాత్ర కచేరీ



కీర్తనలు ఆలపిస్తున్న గాయని వెంకటరమణి

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్ లలితా పీఠంలో శుక్రవారం నిర్వహించిన కర్ణాటక గాత్ర కచేరీ ఆహుతులను అలరించింది. చాగంటి మహాలక్ష్మి, మల్లాది రవికుమార్ శిష్యురాలు పాండ్రువాడ వెంకటరమణి తన అద్భుత గానంతో త్యాగరాజ, రామదాసు కీర్తనలు ఆలపించి భక్తులను మంత్రముగ్ధులను చేశారు. గణేష వందన, నిన్నే భజన, ఒకపరి చూడగ, సీతమ్మ మాయమ్మ, కనుగొంటి శ్రీరాముని, నను బ్రోవమని, శ్రీరాముల దివ్యనామ, రామ కోదండరామ, రామచంద్రుడు నాపై కీర్తనలు వీనుల విందు చేశాయి. సరస్వతుల పార్థివ వయోలిన్‌పై, చైతన్య తాలాడ మృదంగంపై వాద్య సహకారం అందించారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ గాయని వెంకటరమణిని సత్కరించారు.

భూగర్భ జలాల ఆవశ్యకతపై వర్క్‌షాప్



మాట్లాడుతున్న భూగర్భ జల అధికారి లక్ష్మణరావు



నీటిని పరీక్షించే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మల్కాపురం: నేషనల్ హైడ్రోలజీ ప్రాజెక్ట్‌లో భాగంగా 61వ వార్డు మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భూగర్భ జలాల మానిటరింగ్, సుస్థిరత అనే అంశాలపై విశాఖ జిల్లా భూగర్భ జల శాఖ అధికారి లక్ష్మణరావు అవగాహన కల్పించారు. భూగర్భ జలాల ఆవశ్యకత, వినియోగించాల్సిన అవసరం, భద్రత గురించి డిజిటల్ స్క్రీన్ ద్వారా వివరించారు. మేఘాలు ఎలా ఏర్పడుతాయి, వర్షపు నీటిని ఎలా ఉపయోగించుకోవాలనే విషయాలను విశదీకరించారు. నీటిని ఎలా కొలుస్తారు, నీటి పరీక్షలు ఎలా చేస్తారు అనే వాటిని విద్యార్థులచే స్కూల్ ల్యాబ్‌లో పరీక్ష చేయించారు. శ్రీకాకుళం జిల్లా భూగర్భ జలాల సహాయ సంచాలకుడు రమణమూర్తి వేసవి కాలంలో భూగర్భ జలాల హెచ్చు, తగ్గుల వినియోగం తదితర అంశాల గురించి స్టూడెంట్లకు వివరించారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా జల వనరుల డీఈఈ ఎం.రాజేంద్రకుమార్ ఏపీడీ కె.రమేష్‌బాబు, పాఠశాల ఉపాధ్యాయులు కుమార్, కె.పద్మవతి పాల్గొన్నారు.

160 కేజీల గంజాయి పట్టివేత

అక్కిరెడ్డిపాలెం: నిషేధిత గంజాయిని గాజువాక పోలీసులు పట్టుకున్నారు. గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆటోనగర్ డీ బ్లాక్‌లోని సెఫ్ ఎక్స్‌ప్రెస్ పార్సిల్ గొడౌన్‌కు ఇసుకతోటకు చెందిన ఒక ఆటో డ్రైవర్ తన ఆటోలో పార్సిల్ చేసిన 160 కేజీల గంజాయిని తీసుకువచ్చారు. గంజాయిని తరలిస్తున్నారన్న సమాచారంతో గాజువాక పోలీసులు గొడౌన్ వద్దకు చేరుకుని ఆటోను స్వాధీనం చేసుకుని, ఆటోడ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. గంజాయి రవాణాపై ఆటో డ్రైవర్ నుంచి వివరాలు సేకరించగా కరాసలో ఒక వ్యక్తి ఆటోనగర్ పార్సిల్ సర్వీసుకు బేరం మాట్లాడాడని తెలిపాడన్నారు. దీంతో గంజాయిని తీసుకువచ్చిన అసలు వ్యక్తి పరారీలో ఉండగా, ఆటోడ్రైవర్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వరంగంలోనే స్టీల్‌ప్లాంట్‌ను కొనసాగించాలి

సీతంపేట: వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 1న నగరంలో జరిగే మానవహారంలో కార్మికులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం గురుద్వారా కూడలిలో ఆటో డ్రైవర్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జి.వామనమూర్తి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 700 రోజులుగా ఉద్యోగులు దీక్షలు చేస్తున్నా.. కేంద్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని మండిపడ్డారు. రాష్ట్రం నుంచి ఎన్నికైన ఎంపీలు చిత్తశుద్ధితో కేంద్రంపై ఒత్తిడి తెచ్చి స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగంలోనే కొనసాగేలా కృషి చేయాలని కోరారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కొనసాగుతున్న నిరసన దీక్షలకు రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా 1వ తేదీన గాంధీ విగ్రహం నుంచి, ఆర్టీసీ కాంప్లెక్స్ గురజాడ జంక్షన్ వరకు కార్మిక ప్రదర్శన, అనంతరం నిర్వహించే మానవహారంలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. నాయకులు రావికృష్ణ, ఎస్.పాపారావు, పి.రాంబాబు, ఎం.ఈశ్వరరావు, కె.అప్పలరెడ్డి, తాతారెడ్డి, ఆర్.మహేష్ పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

వెలగని వీధిలైట్లు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం, నగరాలవీధి సర్వీసురోడ్డులోని వీధి లైట్లు వారం రోజులుగా వెలగడం లేదు. దీంతో ఆ ప్రాంత నివాసీయులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి లైట్లు వేయాలి.

– గంగిరెడ్ల రాజు, నగరాలవీధి



నగరాలవీధిలో వీధిలైటు వెలగని స్తంభం